క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు


డాక్టర్ అశోక్‌కుమార్, సమన్వయకర్త

అద్దంకి: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ బుధవారం దసరా పండుగు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసత్యంపై సత్యం.. అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం గెలిచిన రోజే విజయదశమి అని తెలిపారు. ఈ విజయదశమి ప్రజల లోగిళ్లలో సుఖ సంతోషాలు నింపాలని, అంతా బాగుండాలని తెలిపారు.

నేడు పట్టణంలో మాంసాహారం నిషేధం

చీరాల అర్బన్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం చీరాల మున్సిపాలిటీ పరిధిలో మాంసాహారం నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్‌డీ అబ్దుల్ రషీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంసం వ్యాపారస్తులు, చికెన్ స్టాల్స్, చేపల వ్యాపారస్తులు గురువారం షాపులు మూసివేయాలని, హోటల్స్, రెస్టారెంట్లు కూడా మాంసాహారం విక్రయాలు నిలిపివేయాలన్నారు. విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అద్దంకి రూరల్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం అద్దంకి పట్టణంలోని మాంసాహార దుకాణాలను మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

వైభవంగా వెంకటేశ్వర కల్యాణం


వెంకటేశ్వర కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ దంపతులు

ఇంకొల్లు(చినగంజాం): వంకాయలపాడులోని సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి వెంకటేశ్వర కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లు జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి దంపతులతో పాటు గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పాడుతా తీయగా ఫేం రసూల్ పాల్గొని అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం


పాటిబండ్ల విజయలక్ష్మిని సన్మానిస్తున్న తేళ్ల రాంబాబు

చీరాల అర్బన్: వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సీపీ ఇంటిలెక్చువల్ విభాగం చీరాల నాయకులు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురంలోని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సోదరి పాటిబండ్ల విజయలక్ష్మిని కలిసి సన్మానించి పండ్లు అందించారు.

సర్వసభ్య సమావేశం మమ..!

- మీటింగ్‌కు హాజరైంది 8 శాఖల అధికారులే..
- ప్రజా సమస్యలపై అంత నిర్లక్ష్యమా..?
- నిలదీసిన ప్రజాప్రతినిధులు


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

కారంచేడు: ప్రతి మూడు నెలలకు ఒక సారి జరిగే మండల పరిషత్ సమావేశం అభాసుపాలవుతోంది. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతనిధులు ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపించాల్సి ఉంటుంది. కారంచేడు మండల పరిషత్ సమావేశం బుధవారం జరిగింది. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కేవలం 8 శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడంపై ప్రజా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 18 శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు మాట్లాడుతూ సమావేశం పట్ల నిర్లక్ష్యంగా ఉన్న శాఖల అధికారులను గుర్తించి వారికి మెమోలు జారీ చేయాలని ఎంపీడీఓకు సూచించారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దని ఆయన హాజరైన అధికారులకు సూచించారు.

రీసర్వేలపై ప్రజా ప్రతినిధుల అభ్యంతరం..

గత ప్రభుత్వం గ్రామాల్లోని రైతుల భూములను రీసర్వేలు చేస్తున్న క్రమంలో అప్పటి కూటమి నేతలు భూముల రీసర్వేల పేరుతో భూములు లాగేసుకుంటారని ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపారని, నేటి కూటమి ప్రభుత్వం అదే రీసర్వేను కొనసాగించడంలో ఆంతర్యమేమిటని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మండల కోఆప్షన్‌మెంబర్ ముల్లా నూర్ అహ్మద్‌లు ప్రశ్నించారు. ప్రస్తుతం మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే నిష్పక్షపాతంగా జరగడం లేదన్నారు. రీసర్వేల సమయంలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వారు రెవెన్యూ శాఖకు వివరించారు. స్వర్ణ–దగ్గుబాడు రోడ్డు పనులు గత ప్రభుత్వంలో ప్రారంభించగా అవి నేటి ప్రభుత్వం కొనసాగించకపోవడంతో ప్రయాణికులు పలు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే పూర్తి చేయాలని అహ్మద్ కోరారు. మండలంలో నేటికీ యూరియా కొరత ఉందని రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంమ్మోహనరావు, ఏఎస్ఐ శేషసాయి, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మత్స్యకారుల ఆందోళన

- సీ మౌత్ పునరుద్ధరణ చేయాలంటూ వాడరేవు గ్రామస్తుల బైఠాయింపు
- చలో బాపట్లను అడ్డుకున్న పోలీసులు


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

చీరాల అర్బన్: చీరాల టీడీపీ నేత బుర్ల వెంకటరావు ఆక్రమించిన ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చీరాల రూరల్ మండలం వాడరేవు, దానవాయిపేట, అడివిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు బుధవారం చలో బాపట్లకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం చీరాల మండలం వాడరేవుకు చెందిన మత్స్యకారులు బాపట్లకు తరలివెళ్లేందుకు 200 మంది ప్లకార్డులతో బయలుదేరారు. అయితే కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సముద్ర ముఖద్వారం ఆక్రమించి.. బుర్ల వెంకటరావు రిసార్ట్ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌ను మూసివేయడంతో పడవలు నిలుపుదల చేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని వాపోయారు. సీఆర్‌జెడ్ నిబంధనలు అతిక్రమించి సముద్ర ఒడ్డుకు వరకు ఆక్రమించి రిసార్ట్స్ నిర్మిస్తున్నారని గతంలో మత్స్యకార గ్రామాల ప్రజల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. సీమౌత్‌ను పునరుద్ధరించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు. కాగా అనుమతి లేకుండా వెళ్లకూడదని పోలీసులు అడ్డుకోవడంతో వారు 216 జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులకు, మత్స్యకారులకు స్వల్ప వివాదం చోటుచేసుకుంది. శాంతియుతంగా నిరసన తెలపాలని, వారిని పంపించివేశారు. అనంతరం మత్స్యకారులు ఎక్కువ సంఖ్యలో బాపట్లకు తరలివెళ్లారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం


పర్చూరులో రక్తదానం చేస్తున్న దాతలు, రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం పర్చూరులోని బీవీఆర్ రోటరీ భవనంలో రక్తదాన సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 51 మంది రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్, అమరావతి రీజియన్ బ్లడ్ డొనేషన్ చైర్మన్ వేణుగోపాల్, తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, ఎ. రత్నప్రభాకర్, నాగబైరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర రెడ్డిని పరామర్శించిన బూచేపల్లి


వెంకటేశ్వర్లు రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుక్కల వెంకటేశ్వర రెడ్డిని దర్శి శాసన సభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మంగళవారం రాత్రి వెంకటేశ్వర రెడ్డికి గుండె పోటు రావడంతో ఆయనను ఒంగోలు వైద్యశాలలో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి ఆస్పత్రికి వచ్చి ఆయనను పరామర్శించారు. వైద్యులతో అతని ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పర్చూరు నియోజక వర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, పార్టీ నాయకులు ఆసోది శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి, కోట సుబ్బరామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి


కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది

చీరాల రూరల్: క్షయవ్యాధి ఒక అంటువ్యాధని ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాప్తి చెందుతుందని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాల చూపుతూ ప్రజలకు క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పించారు. వ్యాధికి గురైనవారు తుమ్మినా, దగ్గినా మరొకరికి వ్యాప్తి చెందుతుందని, వ్యాధి బారినపడినవారు ఏమాత్రం ఆందోళన చెందకుండా దగ్గరలోని ప్రభుత్వాసుపత్రుల్లోని టీబీ యూనిట్‌లో డాట్ పద్ధతిలో ఉచితంగా వైద్యసేవలు పొందాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు మేరకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యాధిబారిన పడటానికి ముందుగా కొన్ని లక్షణాలు మనకు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పారు. ఆకలి సరిగా లేకపోవడం, జ్వరం, దగ్గు రెండు వారాలకు మించి ఉండటం, క్రమంగా శరీర బరువు కోల్పోవడం, కళ్లెలో రక్త చారలు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. వ్యాధి అనుమానితుల వద్ద నుంచి కళ్లె పరీక్షల నిమిత్తం కళ్లె సేకరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం స్వానిధి పథకం సద్వినియోగం చేసుకోండి


మెప్మా సంఘాల సభ్యులకు రూ.10.02 కోట్లను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల అర్బన్: వీధి వ్యాపారస్తులు, చిరువ్యాపారులు పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం స్థానిక బాపనమ్మ కల్యాణ మండపంలో లోక్ కళ్యాణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మెప్మా జిల్లా పీడీ ఆనంద్ సత్యపాల్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్వానిధి పథకం ద్వారా గతంలో 4వేల మందికి రుణాలు మంజూరు చేయడం ద్వారా చీరాలకు అవార్డు దక్కిందన్నారు. ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి త్వరగా రుణాలు మంజూరు చేయాలని అధికారులను, బ్యాంకు మేనేజర్లును ఆదేశించారు. పీఎం స్వానిధి 503 మంది లబ్ధిదారులకు రూ.1.14కోట్లును, మెప్మా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణం కిం 53 సంఘాలకు రూ.10.02 కోట్లును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. మెప్మా సీఎంఎం డీసీహెచ్ కొండయ్య, టౌన్ పెండింగ్ కమిటీ సభ్యులు, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల ధర తగ్గింపు


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

అద్దంకి: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో వ్యవసాయ పరికాలు తగ్గాయాని వ్యవసాయ కార్పొరేషన్ సంచాలకుడు నాగినేని రామకృష్ణ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, మునిసిపల్ కమిషనర్ రవీంద్ర, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో వరూధుని, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరక్టర్ చింతా వెంకటేశ్వర రెడ్డి, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అద్దంకి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం స్వస్త్ నా సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలోభాగంగా సీహెచ్‌సీ వైద్యులు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి చెవి, ముక్కు, గొంతు, దంత చికిత్స, సాధారణ వ్యాధులు, గర్భిణులు, చర్మ వ్యాధులకు నిపుణులు పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్, బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్ పి. వెంకట కిరణ్, కె. వాహిలా చౌదరి, డాక్టర్ తేజస్విని, డాక్టర్ ఎ. అనంతజ్యోతి, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ హిరిబాబు, డాక్టర్ సందీప్, డాక్టర్ మెర్సీ, డాక్టర్ ఓ. ప్రతాప్ కుమార్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది, చిన్నారులు

మార్టూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యం అని అంగన్‌వాడీ సూపర్ వైజర్ టి. శిరీష అన్నారు. పోషణ వేడుకల్లో భాగంగా నేతాజీ నగర్ 1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు బిడ్డకు అనుబంధ ఆహారం కూడా అందించాలని, వ్యాధి నిరోధక టీకాలను బిడ్డకు క్రమం తప్పకుండా ఇప్పించాలన్నారు. తల్లులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

అనుమతులు లేకుండా బాణసంచా అమ్మవద్దు


దీపావళి టపాసుల షాపును పరిశీలిస్తున్న సీఐ

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణం, మండల పరిధిలో దీపావళి మందులను అమ్మేందుకు పోలీస్ అనుమతులు పొందాలని సీఐ సుబ్బరాజు తెలిపారు. బుధవారం అద్దంకిలోని దీపావళి టపాసులు అమ్మే షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దీపావళి టపాసులు, మందుగుండు సామగ్రి అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళికి టపాసులు అమ్మదలచిన వారు అనుమతి పొంది నిర్దేశించిన ప్రదేశాల్లో అమ్మకాలు జరపాలన్నారు.

శాఖాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం


శాఖాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు చంద్రశేఖర్

పర్చూరు (చినగంజాం): శాఖాహారం తీసుకోవడం ద్వారా పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ప్రభుత్వ హోమియో వైద్యుడు దాసరి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ప్రపంచ శాఖాహార దినోత్సవం సందర్భంగా మండలంలోని చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాఖాహార భోజనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలు తీసుకోవడం వలన కలిగి ఆరోగ్య ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని మనం రోజూ తీసుకునే పౌష్టికాహార పళ్ళెంలో పావు భాగం మాంసకృత్తులు, కొవ్వులు, మరొక పావు భాగం తృణ ధాన్యాలు ఉంటే సగ భాగంలో పండ్లు కూరగాయలు ఉంటాయని దీనిని బట్టి మన శాఖాహార భోజనం యొక్క ప్రాముఖ్యతను గ్రహించాలన్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బీపీ, షుగర్, థైరాయిడ్, ఊబకాయం వంటి జీవనశైలి సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. అనేక రకాల విటమిన్ లోపాలను, క్యాన్సర్‌ను కూడా నిరోధించవచ్చునని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతుకు ఊతం


బల్లికురవలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ

మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన వస్తు సేవా పన్ను తగ్గింపుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. మండల కేంద్రం మార్టూరు, ఇసుక దర్శి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం రైతులతో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. మార్టూరులో ఏడీఏ కేవీ శ్రీనివాసరావు ఉద్యానవన శాఖ అధికారి హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపు వలన ఉద్యానవన పంటలకు ట్రాక్టర్, స్ప్రింక్లర్లు తదితర యంత్ర పరికరాలపై తగ్గిన ధరల గురించి అవగాహన కల్పించారు. ఏఓ రామినేని లావణ్య ఆధ్వర్యంలో ఇసుక దర్శి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ రంగంలో జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రెండు గ్రామాల్లో రైతులతో ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు.

బల్లికురవ: జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలు పెరిగాయని ఏ వస్తువుకు ఎంత తగ్గిందో అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ కసుకుమారి కోరారు. బుధవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యావసర వస్తువులతో పాటు గృహోపకరణలు, యంత్రపరికరాలు, కార్లు తగ్గినట్లు ఎంపీడీవో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్ వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయూజ మాసం ఉత్తరాషాఢ దశమి గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఏడుగంటల నుంచి 7.45 వరకు జరిగే ప్రదోషకాలార్చన తర్వాత ఆలయం మూసివేస్తారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొనేందుకు ఏర్పాట్లు చేశారు.